# వైతరణికావల

## తల్లావఝ్ఝల పతంజలి శాస్త్రి

**మరోసారి గదిలోకి వెళ్లి చూశాడతను. ప్రశాంతమైన దీర్ఘనిద్రలో పడుకుని ఉంది అమ్మ. తలకింద తెల్లటి దిండు. మెడవరకూ పల్చటి నీలం దుప్పటీ కప్పింది అతని మరదలు. చెవుల్లో ముక్కులో దూది ఉండలు తీసేస్తే కాసేపట్లో ఆమె లేచి "ఇందిరా! కాస్త టీ పట్రా, తల్లీ!" అంటుందనిపిస్తోంది. అలాగే ఆమెను చూస్తూ గోడనానుకుని నుంచున్నాడు శర్మ.**



**ఆమె** తలవెనక నిశ్చలంగా దీపం వెలుగుతోంది. అమ్మ ప్రాణం ఎరువు తీసుకుని ఉజ్జ్వలంగా వెలుగుతోందనిపించిందతనికి. ఆడవాళ్లలో ఆమె పొడగరికిందే లెక్క. సన్నగా, తెల్లగా ఎప్పుడూ వెనక ఇప్పుడు వెలుగుతోన్న దీపంలా పరిశుభ్రంగా ఉండేదామె. ఓపికఉన్నా, లేకపోయినా రెండుపూటలా స్నానంచేసి తీరవలసిందే. ఫిబ్రవరి నెల వచ్చీరాగానే తనని నానా హడావుడీ పెట్టి ఒక ఆదివారం కలిసి వచ్చేటట్టుగా శలవుపెట్టించి సుధాకరం దగ్గిరికి వచ్చేసేది. ("దిక్కుమాలిన హైదరాబాదు. చెంబుడు నీళ్లలో ఆ స్నానాలు నే చేయ్యలేన్రా!") ముగ్గురన్నదమ్ముల దగ్గిరా ఆమెకి ఎప్పుడు ఎంతకాలం ఉండాలనిపిస్తే అంతకాలం ఉండేది. చిన్నవాడవడం వల్ల సుధాకరం అన్నా, చిన్న కోడలు ఇందిర అన్నా ఆమెకి ఓ పిసరు ఎక్కువ ఇష్టం. హాల్లో ఎవరో వచ్చినట్టున్నారు; చెల్లెలు ఏడుపు సన్నగా వినబడుతోంది. పాపం అది ఉదయం వచ్చిందగ్గిర్నించీ ఏడుపు ఆపుకోలేకపోతోంది. శర్మ అన్నదమ్ములకి ఒక్కతే చెల్లెలు. బోలెడు గారం, ప్రేమ. ఈ వేసవి వెళ్లగానే దానిదగ్గిరికి వస్తానని చెప్పింది అమ్మ. అల్లుడు కంపెనీ పనిమీద రెండు నెలలపాటు ఇండోనేషియా వెళ్లాడు. ఎలాగూ అతనూ వస్తాడు,' అప్పుడు వెడతాలేరా అనేది. దట్టంగా కర్పూరం చల్లాడు సుధాకరం. శర్మ మెల్లిగా దగ్గిరికి వెళ్లి ఆమె పక్కన కూచున్నాడు. అసంకల్పితంగా అరచెయ్యి ఆమె నుదుటిమీద పెట్టాడు. చల్లగా ఉంది. తెల్లగా, పల్చగా ఉలిపొర కాయితంలా ఉంటుందామె చర్మం. గట్టిగా రాస్తే చిరిగిపోతుందేమో అనిపించే పల్చటి ముడతలు ఆమె నుదుటిమీదా, చేతులమీదా. అతని కళ్లనిండా నీళ్లు తిరిగేయి. ఆమె చెయ్యి తన వెచ్చటి చేతిలోకి తీసుకున్నాడు శర్మ. ఒకచేతికి ఇంకా సన్నటి బంగారు గాజు. చెవులకి తెల్ల దుద్దులు. కన్నీళ్లు చెంపలమీదికి జారడం అతను గమనించలేదు. హైదరాబాదు నుంచి వచ్చి నెల అయింది. తను వచ్చి దిగబెట్టి వెళ్లేడు. వచ్చే నెలలో మళ్లీ వస్తానని చెప్పాడు శర్మ. డెబ్భయిరెండేళ్లు దాటాయి. పుట్టినరోజు తనదగ్గిరే ఉంది అమ్మ. కొత్తచీర బలవంతంగా కట్టించారు. మనవరాళ్లిద్దరూ చెరోపక్కా నుంచుని ఫొటో తీయించుకున్నారు. వచ్చేటప్పుడు మళ్లీ ఆమెకిష్టమైన గుంటూరు చేనేత చీర కొని ఆమెకి చెప్పకుండా పెట్టెలో పెట్టింది శర్మ భార్య. చల్లగా ఉంది అమ్మ చెయ్యి. పల్చటి పొడుగాటి వేళ్లతో తన బట్టతల దువ్వుతూ అనేది ! "మీ నాన్నకి పోయేనాటిక్కూడా ఒక్క వెంట్రుక ఊడలేదు. నీకేవిట్రా అప్పుడే ఈ బట్టతల?"

"నాన్నకి మా చిన్నప్పట్నించీ ఇంతే మామ్మా!"


"అప్పుడే ఏవిటమ్మా, నేను ముసలాణ్నవుతున్నాను."

పొత్తిళ్లలో ఉన్నప్పుడు తెలీదుగానీ తన తలమీంచి తేలిగ్గా భుజంమీదికి జార్చిన అమ్మ చెయ్యి హాయిగా ఉండేది. తనకి బదులు మనవరాల్ని దగ్గిరికి తీసుకుని బుగ్గమీద ముద్దుపెట్టుకునేది. ఎంత ఆలస్యం అయినా ఆఫీసునుంచి రాగానే లోపలికి వెళ్లి చొక్కా తీసేసి

ఆమె దగ్గిర అయిదు నిముషాలు కూచోక తప్పదు. చొక్కాకి అంటుకునే సిగరెట్ పరిమళాలు గిట్టవామెకి. ("వెధవ మతాబాలు. రోజుకి ఎన్ని తగలేస్తాడే మీ నాన్న?")

శర్మ ఉద్యోగంలో చేరిన పాతిక సంవత్సరాలలో ఒకసారి కూడా అమ్మ ఉండగా ఇంట్లో 'మతాబా' వెలిగించలేదు.

"అన్నయ్యా!" పిలుపుతోబాటు సుధాకరం చెయ్యికూడా శర్మ భుజంమీద పడింది. కన్నీళ్లతో వెనక్కి చూశాడతను. ఇంకో క్షణం ఉంటే సుధాకరానిక్కూడా కళ్లు చెమర్చేట్టున్నాయి. కళ్లు



తుడుచుకున్నాడు శర్మ. చెయ్యి అందిస్తూ అన్నాడు సుధాకరం -

"బ్రాహ్మలొచ్చారు. బాబాయి మాట్లాడుతున్నాడు, నిన్నోసారి రమ్మంటున్నాడు!"

ఇద్దరూ హాల్లోకి వచ్చారు. శర్మని చూడగానే కుర్చీలోంచి లేచి దగ్గిరికొచ్చి చెయ్యి గట్టిగా పట్టుకుంది చెల్లెలు. ఆమెకి మళ్లీ కళ్లు చెమరుస్తున్నాయి. పెళ్లయి, ఇద్దరు పిల్లల తల్లిలా అనిపించలేదతనికి. భుజంమీద చెయ్యి వేసి "కూచో వస్తాను. బాబాయి పిలుస్తున్నాడు!" అన్నాడు. ఆమె నిశ్శబ్దంగా తల ఊపి వెళ్లిపోయింది. బయట బాబాయి నలుగురు బ్రాహ్మలతో మాట్లాడుతున్నాడు. శర్మని చూడగానే వాళ్లు దణ్ణంపెట్టి మాటలు ఆపేశారు.

బాబాయి అన్నాడు - "శర్మా! వీళ్లు మనకి తెలిసినవాళ్లే. అంటే మా బ్రహ్మగారు పంపించారు. నాతో బేరాలాడొద్దని ముందే చెప్పేశాను. నీతో కూడా ఓ మాట చెప్పమంటున్నారు."

నలుగుర్లో పెద్దవాడు అందుకున్నాడు -

"తమ బాబాయిగారు అన్నీ చెప్పారండీ! వారితో బేరాలు మాకు తగని పనండి. వారు పెద్దవారు. బాంకు ఆఫీసరుగారు. మేం దండ కట్టుకుని నుంచోవలసినవారమే కానండి, ఎదురు చెప్పే ప్రసక్తి లేదండీ! వారో మాట శలవిచ్చారు. కాదనలేం. పెట్టేవారి దగ్గిర అడగవలసిన విధాయకం ఉంది గనక ..."

"సరే, మీరు ఎంత అడిగారు? బేరాలాడ్డం మా కెవరికీ ఇష్టంలేదు. మా అమ్మగారికి అన్నీ సవ్యంగా జరగాలి. బాగా జరగాలి. అదొక్కటే."

"చిత్తం, ఆ లోటు ఎన్నటికీ ఉండదండీ! మేం మరో రెండువందలు దయచెయ్యమని అడుగుతున్నాం. ఇహనిప్పుడు మీ మాట విన్న తరువాత ఏవీ అనం. మీ దయ. మిగతా విషయాలు కూడా అనుకుంటే ..."

బాబాయి అన్నాడు - "ఒరేయి సుధా! కాయితం పెన్నూ పట్టుకుని రమ్మని చెప్పు మీ వదినతో."

తల ఊపి లోపలికెళ్లాడు సుధాకరం. క్షణంలో పెన్నూ కాయితంతో ఇద్దరూ వచ్చారు.

"అయ్యా చలంగారూ! మీరు ఆ పక్కకి వెళ్లి అమ్మాయికి కావలసినవి అన్నీ చెప్పండి. అమ్మా అరుణా, ప్లీజ్ మేక్ ఎ లిస్ట్ ఆఫ్ థింగ్స్!" అన్నాడు బాబాయి.

"రండి, వదినగారూ!" అంటూ సుధాకరం దారి తీశాడు. లోపల అందరికీ ఇందిర కాఫీలు అందిస్తోంది. ఎండ చురచురమంటోంది బయట. మిగతా బ్రాహ్మలు శర్మవేపు అనాసక్తంగా చూస్తున్నారు. ఇంటి ప్రహారీని ఆనుకుని పచ్చటి చెట్టు గొడుగుపట్టి నుంచుంది. గేటు తలుపు తోస్తూ అక్కడికి దారితీశాడు బాబాయి. జేబులోంచి సిగరెట్ తీసి శర్మకి ఒకటి ఇచ్చి తనూ వెలిగించాడు.

"ఈ పదకొండు రోజుల కార్యక్రమాలన్నీ వీళ్లే చేస్తార్రా! భోక్తల్ని తెచ్చుకోడం, ఇవాళ రేపటి అసలు తంతులన్నీ చూసుకుంటారు. వాహకుల సమస్య లేదు. పైగా శ్మశానం దగ్గిరే, మూడు ఫర్లాంగులుంటుంది."

"అలాగే, నీకు తెలుసుగదా బాబాయి, నువ్వెలా చెప్తే అలాగే!"

"సరే. మరీ, అదే ... మూడూ మూడున్నరకల్లా తీసుకువెడితే బావుంటుందంటున్నారు. అందరూ వచ్చేసినట్టేగా. మావయ్యగారూ వాళ్లూ మధ్యాహ్నానికల్లా వచ్చేస్తారు."

తీసుకెళ్లడం అనగానే శర్మకి ఏదోలా అనిపించింది. గొంతుకు ఏదో అడ్డుపడి మాట రాలేదు. తల ఊపాడతను. సిగరెట్టు పారేస్తూ రోడ్డు అవతలివేపు చూశాడు. ఎదురింటి గోడ నీడలో సగం ఎండలో సగం నిలబడి ఎవరో సిగరెట్టు కాలుస్తూ ఇటువేపే చూస్తూ కనిపించాడు. ఒక క్షణం అతనివేపే చూశాడు శర్మ. ఆ వ్యక్తి సిగరెట్టు అవతల పారేసి వీళ్లవేపు నడవడం ప్రారంభించాడు. అతను దగ్గరయ్యేవరకూ చూస్తూ ఉండిపోయాడు శర్మ. వచ్చి కొంచెం ఎడంగా నుంచున్నాడతను. దగ్గరగా ఉన్నాడేమో అతన్ని పరీక్షగా చూశాడు శర్మ. నాలుగు మడతలు పెట్టిన సంచీ ఓ చేతిలో ఉంది. మాసిపోయిన లుంగీ, మొదటి మూడు బొత్తాలూ ఊడిపోయి తెలుపులోకి వెలిసిపోయిన నీలం చొక్కా, సగం వేలాడుతున్న జేబూ, నాలుగురోజుల తెల్లగడ్డం,

## పాఠకులకు మనవి

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక సోమవారం మార్కెట్లోకి విడుదలవుతుంది. మీ ఊళ్లో, మీదగ్గరి షాపులో ఆరోజున విడుదల కాకపోతే దయచేసి ఈ కింది చిరునామాకు తెలియచేయండి.

సీనియర్ సర్క్యులేషన్ మేనేజర్,
ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక,
ఎక్స్‌ప్రెస్ సెంటర్, లోయర్ టాంక్‌బండ్,
దోమల్‌గూడ, హైదరాబాద్-29.
ఫోన్: 3223586, 3226058.

-ఎడిటర్.


పైకి దువ్విన పల్చటి జుట్టూ, అతని ముఖంనిండా సూదితో గుచ్చినట్టున్న సన్నటి బెజ్జాలూ, గాజుకాయల్లాంటి కళ్లూ - శర్మని చూసి పలకరింపుగా చిన్నగా నవ్వాడతను. ఓ పక్కకి జారిపోయిన కాలరు మధ్య నల్లగీతలా మట్టి పేరుకుపోయింది. అతనికి యాభైనుంచీ నూట యాభై వరకూ ఎంత వయసయినా ఉంటుందనిపించింది. ఎముకలకి అంటుకుపోయిన చర్మంమీద అతని నరంలా వేలాడుతోంది యజ్ఞోపవీతం. వేళ్లతో జుట్టు దువ్వుకుని చూపు తిప్పుకున్నాడతను. బండ వేళ్లూ, గోళ్లకింద నలుపూ చూశాడు శర్మ.

"ఏరా! మావాడేనండీ! అతగాడే దగ్గరుండి అక్కడ అన్నీ జరిపిస్తాడు. రేపు అస్థిసంచయం దగ్గిర కూడా ఉంటాడు. విడిగా మీకేదైనా తోస్తే తప్ప విడిచి ఏవీ ఇవ్వక్కర్లేదు. మేం చూసుకుంటాం. అక్కడ కావలివాడికి మాత్రం ఎలాగూ ఇవ్వాలిసి ఉంటుంది. సరే, నువ్వు పద రామం!" ఇందాకట్నించీ మాట్లాడుతున్న బ్రహ్మగారన్నాడు.

రామం నిశ్శబ్దంగా తల ఊపి శర్మవేపు ఒకసారి చూసి తల వంచుకుని రోడ్డుమీద ఎండలోకి నడిచాడు. కేవలం మృతదేహాల్నే చూడ్డానికి అలవాటుపడ్డట్టున్న అతని కళ్లు శర్మని ఇబ్బందిపెట్టాయి. కాళ్లకింద అతని నీడ చూసుకుంటూ నడుస్తున్నాడతను. చావుకీ, శుచికీ అతీతంగా నిర్లిప్తంగా నడుస్తున్న రామాన్ని కళ్లప్పగించి చూస్తూ ఉండిపోయాడు. ఏదో లారీ అతని దృష్టికి అడ్డొచ్చింది. రామం ఎప్పటికేనా చచ్చిపోతాడా! ఎలా చచ్చిపోతాడో స్ఫురించింది శర్మకి. అతను కట్టెలు పేర్చుకుని పడుకుంటాడు. సిగరెట్టు ఆఖరి దమ్ము లాగి అవతల పారేసి, ఓ చెయ్యి తలకింద పెట్టుకుని మరో చేత్తో చితికి నిప్పంటించుకుంటాడు. అతని గాజుకళ్లు నిర్లిప్తంగా ఆకాశాన్ని చూస్తుంటాయి. ఒళ్లు ఝల్లుమంది శర్మకి. దూరంగా నీడలా కనిపించాడు రామం. భుజంమీద మృదువుగా చెయ్యి పడింది. చటుక్కున తేరుకునేసరికి బ్రాహ్మలు వెళ్లిపోయారు.

బాబాయి అంటున్నాడు-"శర్మా! ఒక ఫోను చేసి ఇప్పుడే వస్తాను. రాగానే అటు వెళ్లి ఓసారి వాచ్‌మన్‌తో మాట్లాడి కట్టెలు పురమాయించాలి!"

"వెళ్లిరా, బాబాయి!"

స్కూటరు స్టార్ట్ చేస్తూ క్షణం ఆగి దగ్గరకి రమ్మన్నట్టు తల ఊపాడాయన.

"శర్మా! బాధపడకుండా ఉండలేం. కానీ కాస్తంత ఎవర్నీ బాధపెట్టకుండా , తను పడకుండా హాయిగా పంచమిరోజు చూసుకుని వెళ్లిపోయిందిరా వదినగారు. అనాయాసమరణం. ఇహ జరగవలసిన కార్యాలన్నీ పెళ్లిలా జరగవలసిందే. అమ్మని తలుచుకుని ఆపేక్షగా నవ్వుకోడంతప్ప మరొకటి వల్లకాదు. మనవాళ్లందరూ వస్తారు. చాలాకాలంపాటు సుఖంగా ఆరోగ్యంగా బతికిందామె. కొడుకులు రెపరెపలాడుతూ పైకొచ్చారు. ఏం కావాల్రా ఆవిడికి? నేను ఇల్లు కట్టేవరకూ సరిగా మాటాడింది కాదు నాతో. కొంపాగోడూ లేకుండా ఊరికే డబ్బు తగలేస్తున్నానని ఆవిడ భయం. ఇల్లు కట్టాను. ఎంత సంతోషించిందనుకున్నావు! బోలెడు ఆపేక్షరా వదినకి. ఇదో ... ఈ చల్లటి చెట్టులా విస్తరించిందనుకో. అదీ! మరి వెళ్లిరానా?"

బాబాయివేపు చూశాడు శర్మ. ఆయన కళ్లలో సన్నటి కన్నీటి పొర. చలవ కళ్లద్దాలు తగిలించుకుని తల వంచుకుని స్కూటరు స్టార్ట్ చేశాడాయన. గేటు తీసుకుని లోపలికి వెడుతుండగా ఆటో ఆగింది. రెండో పిన్నీ, ఆమె ఆఖరి కొడుకూ దిగేరు. శర్మని చూడగానే ఆమెకి దుఃఖం ఆగలేదు.

"ఏరా నాయనా, అక్కయ్య వెళ్లిపోయిందా?"

"అమ్మా! లోపలికి వెళ్దాం, రావే!"

"పద, పిన్నీ!"

ఆమె భుజం చుట్టూరా చెయ్యి వేసి లోపలికి తీసుకువెళ్లాడు శర్మ. వీళ్లని చూడగానే పిన్నిని గట్టిగా కావిలించుకుని చిన్నపిల్లలా మళ్లీ ఏడుపు మొదలుపెట్టింది శర్మ చెల్లెలు.

"పిన్నీ, దా అమ్మని చూద్దువుగాని!" సుధాకరం ఆమెని లోపలికి తీసుకెళ్లాడు. పెద్దమావయ్యా, శర్మ రెండో తమ్ముడూ మెల్లిగా ఏదో మాట్లాడుకుంటున్నారు. కుర్చీ లాక్కుని దగ్గిరగా కూచున్నాడు శర్మ. ఆప్యాయంగా చూశాడు మావయ్య.

"మూడుగంటలకి మొదలుపెడదామంటున్నారు. బయటికెళ్లాడు బాబాయి. ఇప్పుడే వస్తాడు!"

"బావా! కొంచెం కాఫీ తీసుకో!" కాఫీ కప్పుతో నిలబడింది మావయ్య కూతురు ఉమ.

"కాస్త తీసుకోరా!" అన్నాడు మావయ్య. లోపలి గదిలోంచి పిన్ని ఏడుపు వినబడుతోంది.

మరికాసేపటికి బంధువులూ, సుధాకరం స్నేహితులూ వచ్చారు. వాళ్లందరి పలకరింపులు అవుతూండగానే బాబాయి వచ్చాడు. కూచోకుండానే అన్నాడాయన.

"శర్మా! నేనాపని చూసుకువస్తాను. నా వెనకే బ్రాహ్మలు కూడా వస్తున్నారు. కాసేపట్లో మీరందరూ స్నానాలు చేసి తయారవ్వాలి!"

"పద, నేనుకూడా వస్తాను!" అన్నాడు శర్మ.

"నువ్వెందుకురా, బాబాయిని వెళ్లిరానీ!" అన్నాడు మావయ్య.

"ఫరవాలేదు మావయ్యా! వెళ్లొస్తాను. రా, బాబాయి!" క్షణం తటపటాయించి బయటికి నడిచాడు బాబాయి.

ఆయన చెప్పినట్టుగా నగరానికి ఈ మూల ఉన్న శ్మశానవాటిక ఇంటికి పెద్దదూరం కాదు. స్కూటరు ఆపి దిగమన్నప్పుడు గానీ శర్మకి ఎక్కడికి వచ్చాడో అర్థంకాలేదు. చుట్టూరా ఓసారి చూసి బాబాయి మురికి కాలవ పక్కనే ఉన్న సగం కూలిన చెక్క బంకులో ఎవర్నో అడుగుతున్నాడు. రోడ్డు దాటి గేటు దగ్గిర నుంచున్నాడు శర్మ. లోపలికి వెళ్లడానికి బార్లా తీసిన చెక్కగేటు నిరంతరం చేతులు చాచి చావుని ఆహ్వానిస్తున్నట్టు, అసలు ఎవరూ ఎప్పుడూ వేసినట్టు కనిపించలేదు. గేటుపక్కనే లోపల కుళాయిలోంచి సన్నగా నీళ్లు కారుతున్నాయి. తటాలున లోపల్నించి పరుగెడుతూ వచ్చిన మూడు పందుల్ని తప్పించుకుని నిర్ఘాంతపోయి నుంచున్నాడు శర్మ. జేబులోంచి రుమాలు తీసి ముక్కుకి అడ్డం పెట్టుకున్నాడు. కడుపులో దేవినట్టయింది. ఎకరం పైనే ఉంటుంది రుద్రభూమి. చుట్టూరా ప్రహరీగోడ. గేటు ఎదురుగా వెనక గోడకి చేర్చి చిన్న షెడ్డు. ఒకపక్కగా కొంచెం ఎత్తుగా ఉన్న మట్టిదిబ్బ. దిబ్బకి అవతల గోడకి దగ్గిరగా మృత్యుసముఖంలో ఏపుగా ఎదిగిన రెండు తురాయిచెట్లు. దిబ్బకీ కుళాయి గోడకీ మధ్య నీళ్లు నిండిన గుంటలో పంది ఒకటి విశ్రమిస్తోంది. గాలితో నిమిత్తం లేకుండా దట్టమైన దుర్గంధం

శర్మ కడుపునీ, గుండెల్నీ నింపేసింది.

శవాలు కూడా భరించలేని వాతావరణం. తల తిరిగిపోయిందతనికి. ఈ దుర్గంధం తన శరీరంలో శాశ్వతంగా ఉండిపోతుందనిపించింది. అసంకల్పితంగా నాలుగడుగులు వెనక్కి వేశాడు. ఎందుకో వెనక్కి చూశాడు శర్మ. చెట్టుకింద గోడమీద కూచుని ఇద్దరు కుర్రాళ్లు చెరో సీసాలోంచి తాగుతూ ఒక సిగరెట్టు ఇద్దరూ కాలుస్తూ కనిపించారు. శర్మకి వాంతి వచ్చినంత పనైంది. బాబాయి చెక్కబంకువాడితో మాటాడుతున్నాడు. శర్మని చూసి అన్నాడు బాబాయి -

"వాచ్‌మన్ ఇప్పుడే అటు వెళ్లాట్ట. వచ్చేస్తాడు!"

అప్పుడు చూశాడు పరీక్షగా శర్మ. బంకు పక్కనా, ముందూ రాశులుగా ప్లాస్టిక్‌వి, గాజు సీసాలూ, డబ్బాలూ, చిన్న అట్టపెట్టెలు, పాలిథిన్ సంచులూ వేటికవి విడిగా పోసి ఉన్నాయి. ఎక్కువభాగం విస్కీ, బీరు సీసాలు. గోనెసంచీ పడుకోబెట్టి ఒక్కో కుప్పనీ అందులోకి ఎత్తిపోస్తున్నాడతను. అతని నోట్లో సిగరెట్టు వెలుగుతోంది. మట్టీ మకిలీ పేరుకుపోయిన కుప్పలు కదిలించినప్పుడల్లా ఘాటైన దుర్గంధం అతని ముక్కుని తాకుతోంది. అతని జుట్టూ, చొక్కా, పాంటూ అంగుళాల మందంతో దుమ్ముకొట్టుకుని ఉన్నాయి. చటుక్కున తల ఎత్తి నోట్లోంచి సిగరెట్టు తీసి అన్నాడు -

"అడుగోండి, అప్పలాజండి ఆడి పేరు!"

శర్మ, బాబాయి రోడ్డువేపు చూశారు. ఖాకీ నిక్కరు, తలకి తువాలు తలపాగా, నల్లటి చేతుల్లేని బనీనుతో బీడీ కాలుస్తూ వస్తున్నాడు అప్పలాజు. దగ్గిరకి వస్తూనే పసిగట్టేడు అప్పలాజు.

"నమస్కారం బావూ, నాకోసవేనండీ!"

అతని మాటలు గుప్పుమన్నాయి. బాబాయి శర్మవేపోసారి చూసి అవసరం చెప్పాడు అప్పలాజుకి.

అంతా విని తువాలు మెళ్లో వేసుకుంటూ అన్నాడు - "అలాగేనండి బావూ! ఎదురుగా పుల్లలకి సాపులున్నాయండి. మూడు గుళ్లుబడతాయండి. ఒకేల మయాన సరిపోకపోయినా నానెల్లి తెచ్చుకుంటానండి. అదండి. మరి నా మాట కూడా చెప్తే ఓపాలి లోపలికెల్లి మంచి సోటు ఎతుక్కుని ఎల్దురుగాని!"

"ఎంతవుతుందో నువ్వే చెప్పు!"

"నాను మీకు సెప్పడవేటండీ?"

"ఫరవాలేదు చెప్పు. అవతల పన్లున్నాయి."

"మూడొందల యాభై ఇప్పించండి!"

"సరే, మూడొందలు తీసుకో!"

"సిత్తం. ఇంకేవంటానండి. మొగోరా, ఆడమనిసాండి?"

"మా వదినగారు. ఈయన తల్లిగారు."

"రండి బావూ! అమ్మగారికి సుబ్రంగా ఉండే జాగా సూద్దావండి. నాను అన్నీ దగ్గిరుండి జాగరత్తగా సూత్తానండి. అప్పలాజు నంజికొడుకు బాగా జేశాడు కాదని నాకు మాట రాకూడదండి! రండి, బావూ!"

బలవంతంగా లోపలికి నడిచాడు శర్మ. నాలుగు మడతల రుమాలు ఊపిరితిత్తులమీద దుర్గంధం చేసే దాడిని ఏవీ చెయ్యలేకపోతోంది. గేటునుంచి సన్నటి సిమెంటు బాట వెనక పెద్దవరకూ ఉంది. సగం దారిలో మట్టితో కప్పుకుపోయింది. లోపలికి నడిచేకొద్దీ శర్మ కడుపులో తిప్పడం ఎక్కువైంది. దిబ్బకి అవతల రెండు గేదెలు గడ్డి మేస్తున్నాయి. సిమెంటు బాటకి కుడివేపుగా సగం కాలిన చాపా, దానికి దూరంగా ఎండిపోయిన పూలూ పడున్నాయి. మనిషివో జంతువ్వో తెలీని ఎముకలు అక్కడక్కడా పచ్చగడ్డిలో ఎండుతున్నాయి. దారినిండా పగలు పందులూ, రాత్రి మనుషులూ విసర్జించిన గుర్తులు ఎండిపోయి తప్పించుకు నడవడానికి వీలు లేకుండా ఉన్నాయి. పగిలిన బీరు సీసాలూ, చిన్న విస్కీ సీసాలు ఎక్కడపడితే అక్కడ పడున్నాయి. వెనకనుంచి అప్పుడే స్నానం ముగించిన పంది శర్మని ఇంచుమించు రాసుకుంటూ ముందుకు వెళ్లిపోయింది. నిలబడిపోయాడతను.

బాబాయి, అప్పలాజు మరో పదడుగులు నడిచి బాటకి ఎడంవేపుగా ఉన్న చోటుని పరిశీలిస్తూ నుంచున్నారు. అప్పలాజు మాటలు వినబడుతున్నా శర్మకి అర్థంకావడంలేదు. మరో నిముషంలో ఇద్దరూ వెనక్కి మళ్లారు. గబగబా నలుగురూ బయటికి నడిచారు. ముందు వెళ్లి స్కూటరు దగ్గిర నుంచున్నాడు శర్మ. లోపల్నుంచి ఇద్దరు కుర్రాళ్లూ ఖాళీ సీసాల్తో గేటువరకూ వచ్చి ఒకేసారి ఇద్దరూ దిబ్బమీదికి విసిరేశారు సీసాల్ని. కళ్లు తిరిగినట్టనిపించి సీటు గట్టిగా పట్టుకున్నాడు శర్మ. బాబాయి అంటున్నాడు -

"సరే, అక్కడ శుభ్రం చేయించి ఉంచు. మూడు దాటగానే వస్తాం!"


"అయ. ఓ యాభై అడ్వాన్సిప్పించండి!"

జేబులోంచి యాభై నోటు తీసిచ్చాడు బాబాయి. స్కూటరు స్టార్టు చెయ్యబోతూ శర్మ ముఖం చూసి ఆగిపోయాడాయన. ఆయనకి అతని ముఖం చూడగానే అర్థం అయిపోయింది.

"ఇది అంతేరా! పోయేవరకే తప్ప పోయింతరవాత వాళ్లమీద గౌరవం లేదనడానికి ఇదే నిదర్శనం. ఎవరికీ అక్కర్లేదు. పద! ఆఁ ... మర్చిపోయాను. నేనూ ఉంటాననుకో. అయిపోగానే బయటికి వచ్చి ఎడంగా చివరివరకూ ఉండడం మంచిది. లేకపోతే వీడు మన వెనకే వచ్చికట్టెలు సరిపోలేదని మరో వందో రెండో తీసుకుపోతాడు. ఆమధ్య మా కొలీగ్ పాదరు పోయినప్పుడు అలాగే జరిగింది!" స్కూటరు కదిలించాడు బాబాయి.

చెక్కబంకు యజమాని ఇదేవీ పట్టించుకోడంలేదు. మూడు బస్తాల్నీ కట్టడంలో మునిగివున్నాడు. బంకు, రుద్రభూమి దూరం అవుతూండగా సుధాకరం మాటలు జ్ఞాపకం వచ్చాయి శర్మకి.

" ... ఏవీ బాధపల్లేదురా! రెండ్రోజుల్నించీ నీరసంగా ఉంటోంది. నిన్న సాయంకాలం మామూలుగా స్నానం చేసొచ్చి ఇస్త్రీ చీర



## జ్ఞాపకం

'జ్ఞాపకశక్తిని పెంచుకోండి అనే అంశంమీద రెండుమూడు గంటల కార్యక్రమం జరుగుతోంది. ఒక గంటతర్వాత రంగారావు లేచాడు వెళ్లిపోవడానికి. నిర్వాహకుడు అడిగాడు- "ఎందుకు వెళ్తున్నారూ?" అని.

"ఇంతకుముందు ఒకసారి ఈ కార్యక్రమానికి హాజరైనట్లు ఇప్పుడే గుర్తు వచ్చింది. అందుకు" అంటూ వెళ్లిపోయాడు రంగారావు.

**-టి.వి. ప్రసాద్,** నాగార్జునసాగర్

కట్టుకుంది. దుప్పటీ దిండుగలేబూ మార్చమంది. ప్రతి నాలుగురోజులికీ వాటిని మార్చవలసిందే. వచ్చి మంచంమీద పడుకుని మంచినీళ్లు కావాలే అంది. ఇందిర నీళ్లు ఇస్తుంటే నేను స్నానానికి వెళ్లాను. నీరసంగా ఉందే అందిట. మరో నిముషం అయిందిరా. ఇందిరా కడుపులో గాభరాగా ఉందే అందిట. ఏవిటో ఆయాసం వస్తోందే అనగానే కూచోండి అత్తయ్యా అని మెల్లగా లేపి తల తన భుజంమీద పెట్టుకుని ఎలా ఉంది అత్తయ్యా అనడిగింది. అప్పటికే ఏదో మగతలా వచ్చేసిందిరా, ఊపిరి బలంగా పీలుస్తోంది. చటుక్కున కళ్లు తెరిచీ బాబీ అందిట. ఇందిరకి భయంవేసింది. అమ్మని పడుకోబెట్టి బాత్రూం దగ్గిరికి పరిగెట్టుకొచ్చిందిరా! అలాగే తువాలు చుట్టుకుని పరిగెట్టాను. తల ఒళ్లో పెట్టుకుంది ఇందిర. కళ్లు తెరిచి నన్ను చూసింది. నా చెయ్యి గట్టిగా పట్టుకుంది. అంతేరా. అమ్మా అమ్మా అని నాలుగుసార్లు పిలిచాను. అప్పటికే వెళ్లిపోయింది .... తరవాత ఎన్నిసార్లు చూసినా హాయిగా నిద్రపోతున్నట్టే ఉందిరా. శుభ్రంగా స్నానం చేసి, ఇస్త్రీ చీర కట్టుకుని గుడికి వెళ్లేముందు ఉంటుంది చూడు, అలా ఉందిరా! ఎప్పుడూ చదువుకునే దేవీభాగవతం దిండుదగ్గిర నీట్‌గా చదువుతున్న పేజీ దగ్గిర చిన్న కాయితం పెట్టుకుని..." కడుపులోంచి తెర్లుకొచ్చింది శర్మకి. బాబాయి భుజంమీద తల ఆనించాడు. తనదగ్గిర ఉన్నప్పుడు కూడా సాయంత్రంపూట అరుణకి కూరలు తరిగి ఇచ్చేది. అరటికాయలు తరిగినా, వంకాయ తరిగినా గిన్నెపక్కన ఒక్క చుక్క నీళ్లు పడేవి కాదు. మొన్న మొన్నటివరకూ ఒకపూట వంట చేసిపెట్టేది. ("మీ ఆయనకి మజ్జిగ పులుసు వేవిళ్లు పోలేదేవిటే ఇంకా!")

"అంత శుభ్రంగా క్లీన్ ఎలా చేస్తారండీ? అత్తగారు వంట చేసిన తరవాత నేను చెయ్యాలంటే సిగ్గుగా ఉంటుంది!" అనేది అరుణ.

మూడు దాటుతూండగా ముగ్గురు కొడుకులూ పండు బాదంఆకులాంటి తల్లిని చేతులమీద తీసుకొచ్చి వెదురు కర్రలమీద పడుకోబెట్టారు. బ్రాహ్మలు మంత్రాలు చదువుతున్నారు. శర్మకి ఒక్క అక్షరం వినబడ్డంలేదు.

"బాబూ! అమ్మగారికి జాగ్రత్తగా నీళ్లు పొయ్యండి, నాయనా!"

స్నానం చేయించిన తరువాత మళ్లీ ఆమె పడుకున్న దిక్కు మార్చారు. మనవల్లూ, మనవరాళ్లూ, కొడుకులూ, కోడళ్లూ, మరిదీ, తమ్ముడూ అందరూ నమస్కారం చేస్తూ ఆమె చుట్టూరా ప్రదక్షిణం చేశారు. కాళ్లకి నమస్కరించారు. అందరి కళ్లూ నీళ్లు నిండి ఉన్నాయి. ఎవరూ దుఃఖాన్ని ఆపుకోడానికి ప్రయత్నించడం లేదు. బాబీ వెనక గోడని ఆనుకుని కళ్లనీళ్లు పెట్టుకున్నాడు. శర్మకి దుఃఖం రాలేదు. వీధిలోకి చూస్తూ నిలబడిపోయాడు. ఇంతలో అరుణ లోపల్నించి అత్తగారికిచ్చిన కొత్తచీర తెచ్చి ఆమె మీద కప్పింది. అరుణకి ఏడుపు ఆగడంలేదు. వణుకుతున్న చేతులతో నమస్కారం పెట్టి నుంచుండిపోయింది.

"శర్మగారూ! మీరు రండి బాబూ! ఆ నిప్పుల కుండ తీసుకుని ముందు నడవండి. వెనక్కి చూడకండి. అయ్యా! బయలుదేరండి!" శర్మ నడిచాడు. అతని వెనక పెద్ద దుఃఖతరంగం నిశ్శబ్దంగా ఎగసి బద్దలైంది.

సరిగ్గా గేటు-దగ్గిర దింపేరు. శర్మకి ఎవరో గుండె పిండినట్టయింది. యాంత్రికంగా కర్మకాండ చేస్తున్నాడు. మొత్తానికి అతనికి తెలీని స్థితిలో అమ్మని కట్టెలమంచంమీద పడుకోబెట్టారు.

"ముమ్మారు ప్రదక్షిణం చెయ్యండి బాబూ!"

నీటికుండ బద్దలైంది. కట్టెలు అంటుకున్నాయి. ఆత్రంగా జ్వాలలు ఎగుస్తున్నాయి.

"ఇహ వెనక్కి చూడకుండా బయటికి వెళ్లిపొండి బాబూ!"

అందరూ బయటికి నడిచారు. ఆమెమీద కప్పిన కొత్తచీరను ముందే అప్పలరాజు మడిచి పక్కన పెట్టుకున్నాడు. రోడ్డుమీద వెడుతున్నవాళ్లు ఒక్క క్షణం లోపలికి చూసి మృత్యువు అదిలించినట్టు కంగారుగా వెళ్లిపోతున్నారు. చెక్కబంకు యజమాని మామూలుగా సీసాల్నీ డబ్బాల్నీ వేరు చేస్తున్నాడు. అతని నోట్లో సిగరెట్ వెలుగుతూనే ఉంది. ఎవరూ మాట్లాడ్డంలేదు. కొంతసేపటికి లోపల్నించి ఏదో పగిలిన శబ్దం వినిపించింది.

చీకటి పడింది. నగరంలో లైట్లు వెలిగేయి. అప్పలరాజు కొంచెం తడబడుతూ వచ్చి బాబాయితో ఏదో చెప్పేడు. డబ్బు తీసుకుని వెళ్లిపోయాడతను. మరికాసేపట్లో లోపల్నించి ఓ చేత్తో పొడుగాటికర్ర నేలమీద ఈడుస్తూ మరో వ్యక్తి వచ్చేడు. కర్ర చివర కాలి ఉంది.

"బావూ! నేనే అంతా జాగరత్తగా కాల్చుకుంటూ వస్తన్నానండి. అయిపోయిందండి. ఇంకో పది నిముసాలు. నడుంకాడిది సిన్న ముక్క ఉందండి. తవరు దయ సూపించాలండి. ఆడికెంత ఇత్తన్నారండి?"

"మూడొందలు!" అన్నాడు బాబాయి.

"నంజికొడుకు. రెండొందలని ఆబద్దం చెప్పేడండి. నన్ను మరిచిపోకండి బావూ! ఆడికి మొత్తం ఇచ్చీసేరా బావూ?"

"సగం."

"అది నాకు ఇప్పించండి బావూ! అంతా నేనే చేస్తన్నానండి. ఆడు తాగి రావడవేనండి!"

కర్ర ఈడుచుకుంటూ లోపలికి వెళ్లిపోయాడు వాడు. కాసిని పుల్లలు భుజంమీదా, చేత్తో సీసాల్తో లోపలికెళ్లేడు అప్పలరాజు. శర్మ భుజంమీద చెయ్యి వేశాడు బాబాయి. శర్మ చీకట్లోకి చూస్తూ ఉండిపోయాడు. పూర్తిగా చీకటి పడిపోయింది. చితి తెల్లటి బూడిదయిపోయింది. ముందు బాబాయి శర్మని స్కూటరుమీద ఎక్కించుకుని తీసుకెళ్లిపోయాడు. నిశ్శబ్దంగా మిగతా వాళ్లందరూ నడక సాగించారు.

మరో అరగంట తరవాత అప్పలరాజు మరో సగం సీసా పట్టించి, కుళాయి దగ్గిర ముఖం కడుక్కుని, చంకలో చీర పెట్టుకుని జాగ్రత్తగా నడవడానికి ప్రయత్నిస్తూ సన్యాసమ్మ గుడిసెవేపు నడిచాడు. గుడిసెలో అన్నం కుతకుత ఉడుకుతోంది. కిరసనాయిలు దీపం కంటే పొయిమంట ఎర్రటి వెలుతురు చిమ్ముతోంది. సత్తుగ్లాసులోంచి సన్యాసమ్మా, సీసాలోంచి అప్పలరాజూ మిగిలిన వస్తువుని నాలుగు గుటకల్లో ఖాళీ చేశారు.

"సన్నాసీ ఆ ఎదవకోక ఇప్పెయ్యేహె, ఇదో కొత్తకోక నాను తెచ్చినా గంద!" నుంచుని చీరమడతలు విదిలించి చూస్తోంది సన్యాసమ్మ. అప్పలరాజు ఆమెను నులకమంచంమీదికి తోశాడు. మరో "నంజికనా"తో ఆమె చీర ఊడలాగేశాడు.

సన్యాసమ్మ నవ్వుతో ఆమె పొట్టమీద నల్ల అలలు కదిలేయి.

* * *

కప్పు కాఫీ తాగి మేడమీద చాప వేసుకు పడుకున్నాడు శర్మ. తన చుట్టూరా ఏదో దుర్గంధ వలయం ఏర్పడినట్టు రాత్రి ఒక్క క్షణం నిద్రపట్టలేదతనికి. ఉదయం ఎనిమిదవకుండా బ్రాహ్మలొచ్చేరు. గబగబ స్నానం చేసి లుంగీ కట్టుకుని మీద తువాలు వేసుకుని వచ్చిన ఇద్దరు బ్రాహ్మలలో ఒకాయనతో బయలుదేరేడు శర్మ. లోపల్నించి ఇంధిర వచ్చి తెల్ల ప్లాస్టిక్ డబ్బా బ్రహ్మగారికి అందించింది. "ఆఁ, ఇదిచాలమ్మా!" అంటూ బయటికి నడిచాడు. శర్మకి అడుగుపడ్డం కష్టంగా ఉంది. గేటునానుకుని బీడీ కాలుస్తున్నాడు అప్పల్రాజు. శర్మని చూడగానే చటుక్కున బీడీ అవతలపారేసి "రండి బాపూ! అయగారప్పుడే ఒచ్చీరండి!" అన్నాడు.

ఇంకా వాక్యం పూర్తవకుండానే లోపల్నించి రామం ఒచ్చేడు. ఎముకలమీద అతను తొడుక్కున్న చర్మాన్ని సగం కుట్టి వదిలేసిన దారంలా రామం భుజంమీంచి యజ్ఞోపవీతం వేలాడుతోంది. ఒంటిమీద ఆచ్ఛాదన లేదేమో చురచురమంటున్న ఉదయం ఎండలో సన్నగా కాల్తున్నట్టున్నాడతను. నీళ్లని చూడగానే నిశ్శబ్దంగా మళ్లీ వెనక్కి నడిచాడతను. తువాలు ముక్కుకి అడ్డం పెట్టుకుని బలవంతంగా లోపలికి అడుగుపెట్టేడు శర్మ. తుఫాను అలలాగ ఒక బలమైన దుర్గంధతరంగం అతన్ని వెనక్కి తోసినట్టయింది. ఒక్కసారి కళ్లు మూసుకుని మరో నాలుగు అడుగులు వేశాడు శర్మ. ఉదయవే మనుషులూ, జంతువులూ తీర్చుకున్న అవసరాల గుర్తులు స్పష్టంగా అతని కాళ్లకి అడ్డంగా కనిపిస్తున్నాయి. నీళ్లగుంటలో రెండు పందులు విశ్రమిస్తున్నాయి. మరో నాలుగడుగులు వేసి యథాలాపంగా చెట్లు ఉన్న గోడవేపు చూశాడతను. వెనక్కి తిరిగి పారిపోవాలనిపించింది శర్మకి. చెట్టుకింద గోడకి ఓ పక్కగా ముగ్గురు యువకులు సగం పంట్లాములు విప్పుకుని ఎదురెదురుగా కూచున్నారు. ముగ్గురి ముందూ మూడు సీసాలతో నీళ్లు పెట్టుకున్నారు. ముగ్గురూ సిగరెట్లు కాలుస్తూ మాట్లాడుకుంటున్నారు.

రామం అప్పటికే అన్నీ సిద్ధం చేశాడు. ఇంకా చాలా వేడిగా ఉందక్కడ. శర్మచేత నీళ్లు పోయించి తాను గొంతుక్కూచుని అస్థిసంచయం చేయించాడు రామం. చిదుగులమీద అన్నంపప్పూ ఉడుకుతోంది. ఏడు చేటలతో చితాభస్మాన్ని దూరంగా పోయించారు బ్రహ్మగారు. మొదటి చేట పట్టుకుని కింద వెయ్యబోయి ఆగిపోయాడు శర్మ. కింద చూసి తల తిప్పుకుని మరో పది అడుగుల అవతల భస్మాన్ని జారవిడిచాడు. తువాలు నడుం చుట్టూ చుట్టుకోవడం వల్ల అతని ఊపిరితిత్తులు దుర్గంధంతో బద్దలవుతున్నాయి. వాళ్లు ఏం చెప్తున్నారో, తనేం చేస్తున్నాడో స్పృహ ఎప్పుడో పోయింది శర్మకి.

"ఈ అన్నం అక్కడ వెయ్యండి బాబూ!"

ప్లాస్టిక్ డబ్బాలో అస్థికలు, వస్త్రం, యజ్ఞోపవీతం విడిగానూ పెట్టుకుని ముగ్గురూ వెనక్కి మళ్లేరు. బ్రహ్మగారు అస్తినిమజ్జనం గురించి ఏదో అడుగుతున్నా శర్మ వినిపించుకునే స్థితిలో లేడు. నీళ్ల కుళాయి దగ్గిర అప్పల్రాజు నుంచుని ఉన్నాడు. ఇద్దరు యువకులు ఖాళీ సీసాలు పక్కన పెట్టి కాళ్లు కడుక్కుంటున్నారు. మూడో వ్యక్తి కొంచెం దూరంగా పేంటు తొడుక్కుంటున్నాడు.

విసవిస నడుచుకుంటూ బయటపడ్డాడు శర్మ. రోడ్డుకవతల నుంచుని ఆగిపోయాడు. అతని కడుపు వణుకుతోంది. కొద్దిగా ఆయాసపడుతూ కళ్లు మూసుకున్నాడు శర్మ. స్కూటరుమీద బాబాయి రావడం చూడలేదతను. బాబాయి వెనక సుధాకరం కూచుని ఉన్నాడు. సుధాకరాన్ని చూడగానే నిన్న ఉదయం అతని మాటలు ఫెళ్లుమని జ్ఞాపకం వచ్చేయి.

".... శుభ్రంగా స్నానం చేసి కొత్త ఇస్త్రీ చీర కట్టుకుని గుడికి వెళ్లేముందు ఉంటుంది చూడు, అలా ఉందిరా! ఎప్పుడూ చదువుకునే దేవీభాగవతం దిండుదగ్గిర నీట్‌గా ..."

(ఈ కథ శ్రీయుతులు ఎమ్.కె.మూర్తిగారికీ, ఎమ్.సీతారామిరెడ్డిగారికీ, పట్టపగలు వెంకట్రావుగారికీ)

■

## సాహసబాలలు

### స్నేహితుని రక్షించి ప్రాణాలు కోల్పోయిన మేఘరాజ్



మేఘాలయ రాష్ట్రం షిల్లాంగ్‌కు చెందిన మాస్టర్ మేఘరాజ్‌థాపా అనే 14 సంవత్సరాల బాలుడు, అతని స్నేహితులు మరో ఆరుగురు కలిసి గత సంవత్సరం మే 12న అక్కడకు సమీపంలోగల ఎలిఫెంట్ జలపాతందగ్గర ఆడుకుందామని వెళ్లారు. వారిలోపన్నెండేళ్ల కిషన్‌సింగ్ అక్కడ పారుతున్న సెలయేరుపైన వేలాడుతున్న పువ్వులు అందుకుందామని వంగి, ప్రమాదవశాత్తు కాలుజారి ఇరవై అడుగుల లోతుగల ఆ సెలయేరులో పడిపోయాడు.

అది గమనించిన మేఘరాజ్ ఈదడం చేతకాని కిషన్‌సింగ్ మునిగిపోతే ప్రాణాలు దక్కవని గ్రహించి వెంటనే తాను ఆ సెలయేటిలోకి అమాంతం దూకాడు. కొంతసేపు ఎలాగో శ్రమపడి కిషన్‌సింగును సురక్షితప్రాంతానికి నెట్టేశాడు. ఆ ప్రయత్నంలో అతనికాలు ఒకటి సెలయేటిలో గజిబిజిగా ఉన్న రాళ్లమధ్య ఇరుక్కుపోయింది. దానితో అతను ఆ లోతునీటిలో మునిగిపోయి బయటపడలేక ప్రాణాలను పోగొట్టుకున్నాడు.

స్నేహితుని ప్రాణాలను రక్షించి తన ప్రాణాలనే త్యాగం చేసిన మేఘరాజ్‌కు మరణానంతరపురస్కారంగా ప్రకటించిన సాహసబాలల అవార్డును అతని తండ్రికి అందజేశారు.

**అనిపెద్ది వెంకటరమణరావు**